క్లుప్తంగా

అభివృద్ధికి నోచుకోని ఇందిరమ్మ కాలనీ



నర్సంపేట : నర్సంపేటలోని నాల్గో వార్డు ఇందిరమ్మ కాలనీలో ఎలాంటి అభివృద్ధి లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీజేపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం కాలనీలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు అవుతున్న ఇందిరమ్మ కాలనీలో ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందలేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులకు ప్రజా సమస్యలు పరిష్కరించాలనే చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇందిరమ్మ కాలనీలో సమస్యలు పరిష్కరించి, అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

నర్సంపేట : రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను నోటికి వచ్చినట్లు మాట్లాడి యాదవ సమాజాన్ని కించపరిచి యాదవ వృత్తిని అవమానించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని యాదవ సంఘం డివిజన్ అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్షమాపణ చెప్పకపోతే గొల్లకురుమ(యాదవ) హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామన్నారు.

పరామర్శ

చెన్నారావుపేట : బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు బాల్నె వెంకన్న తల్లి సారమ్మ(80) గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం సారమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించి పరామర్శించారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

రాయపర్తి : ప్రభుత్వ పథకాలను ప్రజలు వినియోగించుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎర్రబెల్లి దయాకర్‌రావు ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు అన్నారు.శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించారు. మూనావత్ నర్సింహానాయక్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎండీ నయీం, వనజారాణి, సర్పంచ్‌లు కర్ర సరితారవీందర్‌రెడ్డి, గారె నర్సయ్య, ఐత రాంచందర్ పాల్గొన్నారు.

సోని మృతికి సంతాపం



నల్లబెల్లి : ఖానాపురం మండలంలోని రంగాపురం జూనియర్ పంచాయతీ కార్యదర్శి సోని మృతి పట్ల మండల కేంద్రంలో దళిత సంఘాల నాయకులు శుక్రవారం సంతాపం ప్రకటించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్టు సాంబయ్య, బొట్ల నరేష్, పులి రమేష్, పరికి నవీన్, రాజయ్య, అనిల్, రాజు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

నెక్కొండ : మండలంలోని సూరిపెల్లి గ్రామానికి చెందిన కక్కెర్ల రామన్న గురువారం సాయంత్రం ఈదుల చెరువు కట్ట చివరలో తాటికల్లు గీసేందుకు వెళ్లాడు. రాత్రి పొద్దుపోయాక కూడా రామన్న ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై, ఫోన్ చేశారు. అయినప్పటికి ఫోన్ ఎత్తక పోవడంతో చెరువు వద్దకు వెళ్లి వెతకగా తాటిచెట్టు కింద పడిఉన్నాడు. ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో రామన్న కాలుతుంటి భాగం విరిగి తీవ్ర గాయమైంది. దీంతో చికిత్స నిమితం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. నిరుపేద గీతకార్మికుడికి భార్య మంజుల, కుమారులు సాయి, సాగర్ ఉన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

దుగ్గొండి : మండలంలోని కేశవాపురంలో ఆరు రోజులుగా నిర్వహించిన శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఇందులో భాగంగా ఆలయంలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు స్థానిక కోనేరులో చక్రస్నానం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి–పూలమ్మ, కంది జితేందర్‌రెడ్డి–సరళ, మనోహర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, ఈఓ కిరణ్‌కుమార్, అర్చకులు దేశికన్ చార్యులు, లక్ష్మీనర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



దుగ్గొండి: గిర్నిబావిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కోమల



సంగెం: తీగరాజుపల్లిలో..



నెక్కొండ: అలంకానిపేటలో..



ఖానాపురం: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

సంగెం : కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మొండ్రాయి, తీగరాజుపల్లి కాళోజీ మాక్స్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,060లు, బీ గ్రేడ్‌కు రూ.2,040లు మద్దతు ధర అందిస్తోందన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి ధాన్యం తీసుకుని రావాలన్నారు. దళారులను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరకు కొనుగోలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గూడ కుమారస్వామి, కర్జుగుత్త రమగోపాల్, ఇజ్జగిరి స్వప్నఅశోక్, మెరుగు మల్లేశం, మంగ్యా నాయక్, ఏఓ యాకయ్య, ఏఈఓ రాజేందర్, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

ఖానాపురం : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని రాగంపేటలో చెన్నారావుపేట సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు. ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఐలయ్య, ఆర్‌బీఎస్ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, సొసైటీ సీఈఓ చిట్టి రవి, సిబ్బంది రాఘవులు, ఎంపీటీసీలు భారతి, కవిత, సీఈఓ రవి, నాయకులు నాగార్జునరెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు..

దుగ్గొండి : మండలంలోని మందపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో గిర్నిబావిలో ఏర్పాటు చేసిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ కాట్ల కోమల శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. రైతులు తమ సరుకులను దళారులకు అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుడిపెల్లి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ కార్తిక్, సర్పంచ్ సమత, ఎంపీటీసీ పిండి కుమారస్వామి, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

నెక్కొండలో..

నెక్కొండ : ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందేందుకు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సర్పంచ్ మాదాసు అనంత లక్ష్మి అన్నారు. మండలంలో అలంకానిపేట గ్రామంలో శుక్రవారం రైతులు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఏ గ్రేడ్ ధర క్వింటాకు రూ.2,060, కామన్ గ్రేడ్ ధర రూ. 2,040 చెల్లిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కర్పూరపు శ్రీనివాస్, ఉప సర్పంచ్ గుంటుక నర్సయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు కోరుకొండ యాకయ్య, మాదాసు సుధాకర్, నాయకులు సూరం రాజిరెడ్డి, గుంటుక సోమయ్య, మంగిశెట్టి రాజారాం, చీకటి వీరస్వామి, మేడి ఉప్పలయ్య, యాకలక్ష్మి, ఉపేందర్, రైతులు పాల్గొన్నారు.

సేవచేయడంలో నర్సుల పాత్ర గొప్పది



వర్ధన్నపేట : నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైద్యులు, సిబ్బంది



చెన్నారావుపేట: నర్సులకు సన్మానం..

వర్ధన్నపేట : రోగులకు సేవచేయడంలో నర్సుల పాత్ర ఎంతో గొప్పదని, వైద్యులు చికిత్స చేస్తారని రోగులకు మానసిక స్థైర్యాన్ని నింపడంలో వారిది గొప్పదని వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ నర్సింహస్వామి ఆధ్వర్యంలో ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నర్సులకు వైద్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. నర్సింహస్వామి మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్–లేది విత్‌ది లాంప్ పుట్టిన రోజు సందర్భంగా ఈ అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహిస్తారని అన్నారు. 1965వ సంవత్సరం నుంచి మే12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సోమశేఖర్, నర్సులు, వైద్య బృందం, రోగులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ నర్సింగ్ డే వేడుకలు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జై భీం పరపతి సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ నర్సింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని స్టాఫ్ నర్స్‌లు స్వరూపరాణి, హేమలత, ఏఎన్‌ఎంలు సుధారాణి, పుష్ప, రమను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరోజన, సర్పంచ్ కుండె మల్లయ్య, ముద్దసాని సత్యనారాయణరెడ్డి, మహ్మద్ రఫీ, ఖాదర్‌పేట సర్పంచ్ అనుముల కుమారస్వామి, వార్డు సభ్యులు గొడిశాల సురేందర్, జున్నుతుల మహేందర్‌రెడ్డి, రవి, వైద్యసిబ్బంది ఉన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన



విశ్వకర్మ సంఘం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ గుంటి రజని

నర్సంపేట : నర్సంపేట పట్టణంలో విశ్వకర్మ కుల సంఘం భవన నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనకిషన్, స్థానిక కౌన్సిలర్ దేవోజు తిరుమలతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ పట్టణ అధ్యక్షుడు దేవోజు సదానందం, రాష్ట్ర కార్యదర్శి కుర్మిళ్ల సుదర్శన్, జిల్లా అధ్యక్షుడు కుర్మిళ్ల రమేష్, గుటోజు నర్సింహచారి, పాల్వంచ వెంకన్న, ఆకారపు చందర్, అల్లోజు వెంకట్‌నారాయణ, కుర్మిళ్ల ధర్మపురి, బెజ్జంకి ప్రభాకర్, దంచనాదుల సతీష్, కొల్లాపురం రాజేష్, కుసుంభ నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ

నర్సంపేట నియోజకవర్గ పీఆర్‌టీయూ టీచర్స్ యూనియన్ భవన నిర్మాణానికి రూ.25లక్షలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ చేసి శంకుస్థాపన పనులను ప్రారంభించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, క్లస్టర్ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న భూక్యా సమ్మయ్య

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా సమ్మయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం కార్యాలయంలో శుక్రవారం మాదాసి యాకుబ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనేక మంది పేదలు కొన్ని సంవత్సరాలుగా పోడు భూములను నమ్ముకొని వ్యవసాయం చేస్తూ కుటుంబాలను పోషించుకుంటూ జీవనం గడుపుతున్నారని, పేదలకు ఆ భూములపై ఎలాంటి హక్కులు లేకపోవడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, భూమిపై హక్కులు లేక అభద్రతకు లోనై అనేక మంది ఆర్థికంగా చితికిపోయారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం సర్వే చేసి అధికారంగా అందరికి ఎలాంటి షరతులు లేకుండా హక్కు పత్రాలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీ చాటుకోవాలని అన్నారు. సర్వేకు పిలుపు ఇచ్చి సంవత్సరం గడిచిపోతున్న ఇప్పటి వరకు జిల్లాలో ఏ ఒక్కరికి హక్కు పత్రం ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొమ్మిది సంవత్సరాల కాలంలో అనేక సంవత్సరాలుగా పోడు సాగు చేసుకుంటున్న వారి భూములను హరితహారం పేరుతో పేదల భూములను లాక్కున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి వారి ఓట్లను వేయించుకొని గద్దెనెక్కిన తర్వాత ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుతున్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరచి పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మూడు సుక్య, హరి, తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామంలో రామాలయ ధ్వజస్తంభ ఏర్పాటుకు గ్రామానికి చెందిన ఎస్ఆర్ఆర్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి రూ.5,00,116లను విరాళంగా అందజేశారు. అలాగే ధ్వజస్తంభ ఏర్పాటుకోసం మామిడాల రవీందర్‌రెడ్డి(జర్నలిస్ట్)తండ్రి రాంరెడ్డి జ్ఞాపకార్థం రూ.1,51,116లను అందించామని సర్పంచ్ లేతాకుల సుమతియాదవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, రెడ్డి సంఘం అధ్యక్షుడు పైడిపెల్లి భీమారెడ్డి, లేతాకుల రంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, పరుపాటి రవీందర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలి

కాజీపేట : గుర్తింపు లేని యాప్‌ల వలలో చిక్కుకోవద్దని కాజీపేట ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు అన్నారు. కాజీపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. నానాటికి సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతిలో మోసాలకు పాల్పడుతున్న విషయాలను ప్రజలు గమనించాలన్నారు. కొత్త యాప్‌లను తయారు చేస్తూ మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలపై ప్రజలను చైతన్యవంతం చేయడానికి ప్రయత్నిస్తున్నప్పటికి అనేక మంది పేదలు వారి వలకు చిక్కుకుని ఉన్నది పోగొట్టుకుని విలవిలాడుతుండడం బాధకరమన్నారు.

‘పది’ విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పెద్ది



వర్ధన్నపేట: విద్యార్థిని సన్మానిస్తున్న నిర్వాహకులు

నర్సంపేట : పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాలలో నర్సంపేట పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు అగ్రగామిగా నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలువగా విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నవీన్‌రావు, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో..

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శుక్రవారం వివేకానంద సేవా సమితి సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సేవా కార్యకర్త మోడెమ్ కుమారస్వామి మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో చదువు ఎంతో ముఖ్యమైందన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని విద్యార్థులు నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో శివాని విద్యాసంస్థల అధినేత నకిరెకంటి రవీందర్, బీజేపీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి, వివేకానంద సేవా సమితి సభ్యులు అనుమాస ప్రేమ్‌ప్రసాద్, నాంపెల్లి యాకయ్య, తాళ్లపెల్లి గోపి, కారంగుల శ్రీనివాస్, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

దుగ్గొండి : మండలంలోని ఏపీజీవీబీ ఆధ్వర్యంలో నాచినపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ వేణుధనుంజయ మాట్లాడారు. బ్యాంకు ఖాతాదారులు, రైతులు, వయోవృద్ధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. సర్పంచ్ పెండ్యాల మమతరాజు, ప్రేమ్‌కుమార్, సరళారాణి, విజేందర్, రాజు పాల్గొన్నారు.

చీఫ్‌విప్‌ను కలిసిన నాయకులు

కాజీపేట రూరల్ : కాజీపేట చౌరస్తాలో శుక్రవారం హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను కాజీపేట 47వ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. సీనియర్ నాయకులు మర్యాల కృష్ణ, సిరిల్ లారెన్స్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను వినయ్‌భాస్కర్ తీసుకెళ్తి ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్నారని అన్నారు.

చిన్నారి వైద్య చికిత్సకు తోడ్పాటునందిస్తా

చిన్నారి యశ్వస్వికి మెరుగైన వైద్యసాయం అందేలా తగిన చర్యలు తీసుకుంటానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీకి చెందిన సర్వేష్ దంపతులు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం చీఫ్ విప్‌ను కలిసి చిన్నారికి సరైన వైద్యం అందక వారు పడుతున్న బాధను వివరించారు. యశ్వసి ఆరోగ్య పరిస్థితి చూసి చలించిన ఎమ్మెల్యే వెంటనే ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

ఐనవోలు : నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంగా మారిందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మండలంలోని ముల్కలగూడెం గ్రామానికి చెందిన జక్కుల రవికుమార్‌కు రూ.1లక్ష చెక్కు ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) నుంచి మంజూరైంది. శుక్రవారం హనుమకొండలోని ఎమ్మెల్యే అరూరి రమేష్ తన నివాసంలో బాధితుడికి చెక్కును అందజేశాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్య శ్రీలో కవర్ కాకుండా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

హసన్‌పర్తి : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. నగరంలోని 56వ డివిజన్ టీఎన్జీఓస్ కాలనీలో సుమారు రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన పోచమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి సర్కార్ అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మణీందర్‌నాథ్, టీఎన్జీఓస్ కాలనీ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శిఖర కలశ స్థాపన

56వ డివిజన్ జవహర్‌కాలనీలోని పోచమ్మ తల్లి దేవాయల శిఖర కలశ స్థాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- తాగునీటి ఎద్దడితోపాటు విద్యుత్ సమస్యను తీర్చాలి
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అనిమిరెడ్డి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రాయపర్తి : వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడితోపాటు విద్యుత్ సమస్యలను తీర్చేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశంలో ఆయా గ్రామాల్లో పేరుకుపోయిన పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితిల్లోను తాగునీటి ఎద్దడి రావొద్దని ఎప్పటికప్పుడు మిషన్ భగీరథ నీటిని అందించేందుకు కృషి చేయాలన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు రైతులు మొగ్గు చూపాలని 12 ఎకరాల వరకు సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం ఉన్నట్లు అధికారులు సభ ముఖంగా తెలిపారు. బాల్యవివాహాలపై గ్రామాలలోని వెనకబడిన సామాజిక వర్గాల్లో అవగాహన కల్పించాలని సర్పంచ్ రెంటాల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన, తండ్రి లేదా తల్లిని కోల్పోయిన చిన్నారులకు మిషన్ వాత్సల్య పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకంలో కనీసం 7గంటలు పనిచేయాలని అంతకు తక్కువ సమయం అంటే కనీసం 4గంటలైనా పని చేయాలన్నారు. వారికి కూలీ రూ.270 వస్తాయని రెండు సార్లు పనుల వద్ద ఫొటోలు దిగాల్సి ఉంటుందని ప్రజాప్రతినిధులు కూలీలకు అవగాహన కల్పించాలని ఏపీఓ కుమార్‌గౌడ్ వివరించారు. సమస్యల పరిష్కారం కోసమే మండల సభ నిర్వహిస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు గైర్హాజర్ కాకుండా హాజరుకావాలని ఎంపీపీ సభలో తెలిపారు. వైస్ ఎంపీపీ ఎనగందుల యాకనారాయణ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ గుగులోత్ కిషన్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంఈఓ రంగయ్య, ఎంపీఓ రామ్మోహన్, పశు వైద్యాధికారులు శృతి, సోమశేఖర్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు,శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనం పెంచాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చెన్నారావుపేట : పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ఉపాధిహామీ కూలీలకు వేతనాలు పెంచాలని ఎంసీపీఐ(యు) మండల నాయకుడు జన్ను రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ భారతికి శుక్రవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలకు పనికి తగ్గ వేతనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మహిళలకు రూ.300, పురుషులకు రూ.500 వేతనాలు చెల్లించాలని అన్నారు. అంతేకాకుండా పని చేసే చోట కూలీలకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మొర్రి శ్రీను, మొగిళి వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, అచ్చానాయక్, సాంబయ్య ఉన్నారు.

‘సీఎం కప్ గెలుచుకోవాలి’



రాయపర్తి : మండలస్థాయి సీఎం కప్–2023ని గెలుచుకోవాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి కోరారు. శుక్రవారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో ఈనెల 15, 16, 17న నిర్వహించే మండలస్థాయి సీఎం కప్ గురించి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీలలో ఔత్సాహికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని క్రీడా ప్రాంగణంతోపాటు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ ఎనగందుల యాకనారాయణ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ కిషన్, ఎస్సై బండారి రాజు, ఎంఈఓ నోముల రంగయ్య ఉన్నారు.